



మహిళా పోలీసుఅధికారికి పతకం బహూకరిస్తున్న సీఎం స్టాలిన్

బాలింత మహిళా పోలీసులకు సీఎం వరం

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో పనిచేసే మహిళా పోలీసులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సరికొత్త వరాన్ని ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం ఎగ్మూరు రాజరత్తినం స్టేడియంలో జరిగిన పోలీసులకు రాష్ట్రపతి సేవా పతకాలు, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్నా సేవా పతకాల ప్రధానోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ... రాష్ట్ర పోలీసు శాఖలో తొలిసారిగా మహిళలు చోటు కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధికి దక్కుతుందన్నారు. అన్నాదురై పేరుతో విశిష్టసేవలందించే పోలీసులకు అన్నాదురై పేరుతో పతకాల బహూకరించే సంప్రదాయాన్ని ప్రారంభించింది కూడా ఆయనేనని చెప్పారు. ఇక మహిళా పోలీసులకు యేడాదిపాటు ప్రసూతి సెలవులు ఇస్తున్నామని, ఆ సెలవులు ముగించుకుని డ్యూటీకి వచ్చే బాలింతలైన మహిళా పోలీసులు ఇంట్లో విడిచివచ్చిన పిల్లల సంరక్షణ గురించి ఆందోళన చెందుతుంటారని, వీరి బాధను గుర్తించి తానొకవరాన్ని ప్రకటించబోతున్నానని చెప్పారు. ఈ మేరకు యేడాదిపాటు ప్రసవం కోసం సెలవుపెట్టి డ్యూటీకి వచ్చే మహిళా పోలీసులు తమ పిల్లలను సంరక్షించగల అత్తవారిల్లు ఉన్న ప్రాంతానికి లేదా తన పుట్టింటి ప్రాంతానికి బదలీ చేయనున్నట్లు పోలీసుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. మూడేళ్లపాటు వీరు తమకు నచ్చిన చోట తమ పిల్లల సంరక్షణపై భయాందోళనలు లేకుండా డ్యూటీ చేయగలుగుతారన్నారు. హోం మంత్రిత్వ శాఖను నిర్వర్తిస్తున్న తాను విశిష్ట సేవలందించిన పోలీసులకు, రాష్ట్రపతి సేవా పతకాలను తన చేతులమీదుగా ప్రదానం చేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి దురైమురుగన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, హోంశాఖ అదనపు కార్యదర్శి ధీరజ్‌కుమార్, డీజీపీ శంకర్ జివాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పళనిక్షేత్రంలో ముత్తమిళ్ మురుగన్ మహానాడు



మహానాడు వేదిక వద్ద నిర్మించిన భారీ పందిరి

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ముత్తమిళ్ మురుగన్ మహానాడు సుప్రసిద్ధ శైవ క్షేత్రం పళనిలో అట్టహాసంగా శనివారం ప్రారంభమవుతోంది. రెండు రోజుల పాటు జరిగే ఈ మహానాడులో తమిళుల ఆరాధ్య దైవం సుబ్రహ్మణ్యస్వామి విశిష్టలతో, ఆ స్వామివారిపై శైవభక్త శిఖామణులు గానం చేసిన కీర్తనలు, రచించిన కీర్తనలపై సదస్సులు జరగనున్నాయి. ఆధ్యాత్మిక ప్రవచనాలు, సమావేశాలు, చర్చా వేదికలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మహానాడులో దేశవిదేశాల నుంచి ఆధ్యాత్మిక వేత్తలు, షణ్ముఖుడిని అనునిత్య ఆరాధించే సాధువులు, భక్తులు విచ్చేయనున్నారు. ఈ మహానాడులో పాల్గొనేందుకు 774మంది స్వదేశీ ప్రతినిధులు, 187 మంది విదేశీ ప్రతినిధులు పేర్లు నమోదు చేసుకున్నారు. 39 మంది విదేశీ ప్రతినిధులు సహా 1003 మంది పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు.



మహానాడు వద్ద స్వామిమలైని తలపించేలా నిర్మించిన ప్రవేశద్వారం

భారీ వేదిక...

ప్రత్యేక అతిథులు, దేశ, విదేశాలకు చెందిన ప్రతినిధులు బస చేయడానికి దిండుగల్, పళనిలో ప్రైవేటు రెస్టారెంట్లు, లాడ్జీలు, దేవస్థానానికి చెందిన వసతిగృహాలు కూడా సిద్ధం చేశారు. ఈ మహానాడు జరగనున్న పళనియాండవర్ కళాశాలలో 4.40 ఎకరాల విస్తీర్ణం కలిగిన క్రీడామైదానంలో 2000 మంది ఆశీనులయ్యే విధంగా భారీ పందిరిని కూడా నిర్మించారు. ఒకే సమయంలో 500 మంది ఆశీనులై భోజనం చేసేలా భోజనశాలను, 200 మంది వీక్షించడానికి అనువుగా వర్చువల్ రియాలిటీ త్రీడీ థియేటర్, ఆరుపడై వీడు ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేశారు. ఇక సుబ్రహ్మణ్యస్వామి కొలువుదీరి ఉన్న ఆరు దివ్యక్షేత్రాల పేర్లతో ఆరు ప్రవేశద్వారాలు ఏర్పాటయ్యాయి. మహానాడు వేదిక, భోజనశాల, ఎగ్జిబిషన్ హాలులో ఎయిర్‌కండిషన్ సదుపాయం కూడా ఏర్పాటు చేశారు.

లక్షమందికి భోజనం..: ఈ మహానాడులో పాల్గొనే భక్తులకు రెండు రోజులపాటు మూడు పూటలా భోజన సదుపాయం కల్పిస్తున్నారు. రోజూ లక్షమందికి శాఖాహార వంటకాలను తయారు చేయనున్నారు. ఆహార పదార్థాల తయారీకి పదికిపైగా వంటగదులు సిద్ధం చేశారు. 300మందికిపైగా పాక ప్రవీణులు వంటకాలను తయారు చేయనున్నారు. భోజనాల సమయంలో రద్దీని నివారించేలా పది చోట్ల ఒకే సమయంలో భోజనం వడ్డించనున్నారు. ఇక మహానాడు కార్యక్రమాలను అందరూ సులువుగా తిలకించే రీతిలో 22 చోట్ల ఎల్ఈడీ స్క్రీన్లను కూడా ఏర్పాటు చేశారు. పర్వతాలయం, గిరి ప్రదక్షిణ మార్గం, మహానాడు జరిగే ప్రాంతాల్లో 17 చోట్ల వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. 14 చోట్ల అంబులెన్స్‌లు కూడా సిద్ధంగా ఉంచారు. పళని బస్‌స్టేషన్ నుంచి మహానాడు జరిగే ప్రాంతానికి భక్తులు, ప్రతినిధులను తీసుకెళ్లేందుకు 10 బ్యాటరీ కార్లను అందుబాటులో ఉంచారు.





మహానాడు ప్రాంతంలో మొబైల్ టాయ్‌లెట్లు - వంటశాలను సిద్ధం చేస్తున్న కార్మికులు

2వేలమంది పోలీసులతో భద్రత..

ఈ మహానాడుకు సుమారు రెండువేల మంది పోలీసులతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. మహానాడులో పాల్గొనే దేవాదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు సహా అందరూ ఒకే విధమైన డ్రెస్‌కోడ్‌లో పాల్గొనేలా 850 మందికి రెండు జతల ధోవతులు, చొక్కాలు, రెండు జతల చీరలు పంపిణీ చేశారు. 226 చోట్ల మొబైల్ టాయ్‌లెట్లు ఏర్పాటు చేశారు. ఇక మహనాడు ప్రాంతంలో డ్రోన్లు, డ్రోన్ కెమెరాల సంచారంపై పోలీసులు నిషేధించారు. దిండుగల్, పళని, శివగిరిపట్టి రహదారి సహా ఆరుచోట్ల వాహనాల పార్కింగ్ ప్రాంతాలు కూడా ఏర్పాటు చేశారు. మహానాడు ప్రాంతంలో శుద్ధీకరించిన తాగునీటి సదుపాయం, మహానాడు వేదిక, భోజనశాల తదితర ప్రాంతాలకు వెళ్లేలా అక్కడక్కడా సూచికలతో తమిళం, ఆంగ్లంతో బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ మహానాడు సందర్భంగా మదురై, దిండుగల్, తేని జిల్లాల నుంచి సుమారు రెండువేల మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నారు. ఈ మహానాడు భక్తులకోసం రాష్ట్ర రవాణా సంస్థ ఆధ్వర్యంలో పళని నుంచి మదురై, కోయంబత్తూరు, తిరుప్పూరు, తిరుచ్చి తదితర నగరాలలకు ప్రత్యేక బస సర్వీసులకు కూడా నడపనున్నారు.

నకిలీ ఎన్‌సీసీ శిబిరం బాలికలపై అత్యాచారం

ప్రధాన నిందితుడు, తండ్రి మృతి ● సేలం కోర్టు మేజిస్ట్రేట్ విచారణ

అడయార్, ఆగస్టు 23: కృష్ణగిరి జిల్లా, బర్గూర్ సమీపంలో ప్రైవేటు పాఠశాల విద్యార్థినులకు నకిలీ ఎన్‌సీసీ క్యాంపులు జరిపి వారిపై అత్యాచారాలకు పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడైన నామ్ తమిళర్ కట్చి మాజీ నిర్వాహకుడు శివరామన్(35) శుక్రవారం తెల్లవారుజామున సేలం ప్రభుత్వ ఆస్పత్రిలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ సంఘటనపై సేలం జిల్లా మేజిస్ట్రేట్ విచారణ జరుపుతున్నారు. ఇదిలావుండగా, గురువారం రాత్రి మద్యం తాగి ద్విచక్రవాహనంపై వెళుతున్న శివరామన్ తండ్రి అశోక్ కుమార్(61) కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఆ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు. కొన్ని గంటల తేడాతో తండ్రీకొడుకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల పలు అనుమానాలు కలుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రకటన జారీ చేశారు. 13 యేళ్ల బాలికపై శివరామన్ అత్యాచారానికి పాల్పడినట్లు నమోదైన కేసులో శివరామన్‌తో పాటు ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్, ట్రస్టీ, ఉపాధ్యాయుల సహా మొత్తం 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఈ కేసులో పోలీసుల అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ప్రధాన నిందితుడు శివరామన్ పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో అదుపుతప్పి కింద పడటంతో అతడి కాలు విరిగింది. దీంతో ఆయన్ను సేలం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి చికిత్సల ందిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనను పార్టీ నుంచి బహిష్కరించారు. అదేసమయంలో తొమ్మిదో తరగతికి చెందిన మరో బాలిక కూడా తనపై అత్యాచారం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో శివరామన్‌పై మరో కేసు నమోదైంది. అదేసమయంలో శివరామన్‌ను సేలం సెంట్రల్ జైలుకు తరలించేందుకు అవసరమైన ప్రక్రియను పోలీసులు పూర్తి చేశారు. దీంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చిన శివరామన్‌కు జైలు సిబ్బంది భద్రత ఏర్పాట్లు చేపట్టారు. ఆ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున ఆయన మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విచారణ ఖైదీ శివరామన్ మరణించడంతో సేలం జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ మూడో కోర్టు న్యాయమూర్తి విచారణ జరిపారు. ఆయన సమక్షంలోనే వైద్యులు శివరామన్ మృతదేహానికి పంచనామా కూడా శుక్రవారం సాయంత్రం పూర్తి చేశారు.



శివరామన్ (ఫైల్‌ఫొటో)



పోలీసులు తరుముతున్నప్పుడు కాలు విరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివరామన్

ర్యాట్ పేస్ట్ ఆరగించిన శివరామన్?

పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో అదుపుతప్పి కిందపడటంతో కాలు విరిగిన శివరామన్‌ను ఆస్పత్రిలో చేర్చగా, ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తూ వచ్చారు. కానీ, ఆయనకు ఇచ్చే మందులు ఏవీ ఏమాత్రం ప్రభావం చూపలేదు. దీంతో ఆయనకు రక్తపరీక్షలు చేయగా, శరీరంలో విషం ఉన్నట్టు తేలింది. ఆ విషయంపై ఆరా తీయగా, ఈ నెల 17న తాను ఆత్మహత్య చేసుకునేందుకు ర్యాట్ పేస్ట్‌ను ఆరగించినట్టు వైద్యులకు చెప్పాడు. ఆ కారణంగానే ఆయన చనిపోయివుంటాడని వైద్యులతో పాటు పోలీసులు భావిస్తున్నారు.

గతంలోనే ఆత్మహత్యాయత్నం

ఓ యువతిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్న శివరామన్‌కు ఒక కుమార్తె కూడా ఉంది. అయితే, శివరామన్‌కు పరాయి మహిళలతో వివాహేతర సంబంధం ఉన్నట్టు తెలుసుకున్న భార్య- తన కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆ తర్వాత శివరామన్ అత్తారింటికి వెళ్ళి కాపురానికి రావాలని భార్యను కోరగా, ఆమె నిరాకరించింది. దీంతో ఆయన గత జూన్ 11న ర్యాట్ పేస్ట్‌ను ఆరగించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది.

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తండ్రి

ఇదిలావుంటే, కృష్ణగిరి జిల్లా కావేరిపట్టణం సమీపంలోని తిమ్మాపురం గాంధీ నగర్ కాలనీకి చెందిన శివరామన్ తండ్రి అశోక్ కుమార్ (61) గురువారం రాత్రి మద్యం తాగి కావేరిపట్టణం - కృష్ణగిరి రహదారిలో ద్విచక్రవాహనంపై వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. ఆ సంఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలోకి జారుకున్న అశోక్ కుమార్‌ను ఇతర వాహనదారులు గుర్తించి, 108 అంబులెన్స్ ద్వారా తొలుత కావేరిపట్టణం ప్రభుత్వ ఆస్పత్రి, అక్కడ నుంచి కృష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. గురువారం రాత్రి అశోక్‌కుమార్ మృతి చెందితే, ఆయన కుమారుడు శివరామన్ శుక్రవారం తెల్లవారుజామున ప్రాణాలు కోల్పోయాడు. కొన్ని గంటల వ్యవధిలో ఇలా తండ్రీకుమారులిద్దరూ మృతి చెందటం అత్యాచారం కేసులో నిందితులుగా ఉన్న పెద్దలను కాపాడేందుకేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరోపించారు. నకిలీ ఎన్‌సీసీ శిబిరాల ముసుగులో విద్యార్థినులపై అత్యాచారాలకు పాల్పడిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం కల్గించిందని, ఈ నేపథ్యంలో ప్రధాన నిందితుడు శివరామన్, అతని తండ్రి అశోక్‌కుమార్ కొన్ని గంటల వ్యవధిలో మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోందని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం తన ఎక్స్ పేజీలో ఆరోపించారు.

వివాదాస్పదంగా మారిన విజయ్ పార్టీ జెండా

● పోలీసులకు బీఎస్పీ ఫిర్యాదు

ప్యారీస్, ఆగస్టు 23: నటుడు విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం పార్టీ కోసం ఆవిష్కరించిన జెండాకు వ్యతిరేకంగా గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బీఎస్పీ శుక్రవారం ఫిర్యాదు చేసింది. కోలీవుడ్, టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో రాణిస్తున్న హీరో విజయ్ ప్రస్తుతం ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. తమిళగ వెట్రి కళగం పేరుతో ప్రారంభించిన పార్టీ కోసం రూపొందించిన జెండాను ఆయన గురువారం పనయూరులో జరిగిన పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆ జెండా నిండా మెరూన్ కలర్, పసుపుపచ్చ, పోరాటతత్వానికి చిహ్నంగా రెండు ఏనుగులు, మధ్య వాగై పుష్పం ఉండడం రాజకీయంగా వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో, విజయ్ పార్టీ జెండాలపై ఏనుగుల బొమ్మలు తొలగించాలంటూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనందన్ డిమాండ్ చేశారు. తమ పార్టీ ఎన్నికల గుర్తు అయిన ఏనుగుకు కేంద్ర ఎన్నికల కమిషన్ అంగీకారం ఉందని, అందువల్ల ఇతర పార్టీలు తమ ఎన్నికల గుర్తును ఏ రూపంలోనూ వినియోగించుకోరాదని ఆనందన్ సోషల్ మీడియాలో వీడియో కూడా విడుదల చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అస్సాం, సిక్కిం రాష్ట్రాలు మినహా మిగతా ఏ రాష్ట్రాల్లోను తమ పార్టీ చిహ్నం ఏనుగును ఏ జెండాలో వాడకూడదని ఆ వీడియోలో తెలిపారు. అంతేకాకుండా ఆయన విజయ్ పార్టీ నిర్వాహకులకు కూడా ఆ వీడియో పంపించారు. ఇదిలా ఉండగా, స్థానిక ఆర్కే. నగర్ ప్రాంతానికి చెందిన సంఘ సేవకుడు ఆర్టీఐ సెల్వం శుక్రవారం వెప్పేరిలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో విజయ్ పార్టీ జెండాకు వ్యతిరేకంగా పిటిషన్ సమర్పించారు. విజయ్ పార్టీ జెండాలో చట్టవిరుద్ధంగా కేరళ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఏనుగుల గుర్తు ఉందని, వెల్లాలర్ సామాజిక వర్గాలు ఉపయోగించే జెండా రంగులు, స్పెయిన్ జాతీయ పతాకంలోని రంగులు, శ్రీలంక తమిళులు గుర్తుగా ఉన్న వాగై పుష్పం అని ఎవరి అనుమతి లేకుండా జెండాలో వాటిని పొందుపరిచారని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం 2012వ సంవత్సరం నుంచి ఏ పార్టీ పతాకంలోనూ అడవి జంతువుల ఫొటోలు, పక్షులు వంటి చిహ్నాలను ముద్రించరాదని, అయితే ఈసీ నిబంధనలు కూడా విజయ్ పార్టీ ఉల్లంఘించిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈసీ నిబంధనలు అతిక్రమించిన విజయ్‌పై పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకోవాలని లేకుంటే హైకోర్టులో కేసు దాఖలు చేస్తానంటూ సెల్వం తన ఫిర్యాదులో తెలిపారు.





సకాలంలో టీఎన్‌పీఎస్సీ పరీక్షా ఫలితాలు

● కొత్త చైర్మన్ ప్రభాకర్





అడయార్, ఆగస్టు 23: తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించే రాత పరీక్షల ఫలితాల్లో ఎలాంటి జాప్యం లేకుండా విడుదల చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని టీఎన్‌పీఎస్సీ కొత్త ఛైర్మన్ ప్రభాకర్ తెలిపారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అయిన ప్రభాకర్‌ను టీఎన్‌పీఎస్సీ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలన్న లక్ష్యం, కలతో టీఎన్‌పీఎస్సీ నిర్వహించే పరీక్షలకు యువత హాజరవుతున్నారన్నారు. ఈ పరీక్షలను నిర్ణీత కాల వ్యవధిలో, ఇతర పోటీ పరీక్షల తేదీలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించేలా షెడ్యూల్‌ను ఖరారు చేస్తామన్నారు. అలాగే, ఈ పరీక్షల ఫలితాలను ముందుగా ప్రకటించిన తేదీల్లోనే వెల్లడించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరాలని భావించే నిరుద్యోగ యువత కృషికి తగిన విధంగా టీఎన్‌పీఎస్సీ చర్యలు చేపడుతుందన్నారు. గత రెండు వారాలుగా తమకు అనేక మంది వివిధ రకాలైన సూచనలు, సలహాలు ఇస్తున్నారన్నారు. పరీక్షలు రాసిన తర్వాత ఫలితాలు వెంటనే విడుదల చేస్తే అభ్యర్థులకు ఉపయోగకరంగా ఉంటుందని, ముఖ్యంగా ఈ పనిలో చేరాలా? లేక మరో ఉద్యోగంలో చేరాలా? అనే విషయంపై నిర్ణయం తీసుకునే వెసులుబాటు లభిస్తుందన్నారు. ప్రతి పోటీ పరీక్షను యేటా నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇప్పటివరకు ఎలాంటి చెడ్డ పేరు, అవినీతి మరక లేకుండా పనిచేస్తుందని, దీన్ని మరింతగా మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తామని ప్రభాకర్ తెలిపారు.

వివాహమైన 13 రోజులకే..

గుండెపోటుతో యువకుడి మృతి ● తిరుమల కాలినడక మార్గంలో ఘటన ● శోకసంద్రంలో కుటుంబీకులు



నరేష్ (ఫైల్ ఫొటో)

తిరుమల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వివాహమైన 13 రోజులకే ఓ యువకుడు అలిపిరి కాలినడక మార్గంలో గుండెపోటుతో మృతిచెందాడు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడులోని తిరుత్తణికి సమీపంలో ఉన్న కీసలంకు చెందిన నరేష్(32) బెంగళూరులో స్థిరపడ్డాడు. అక్కడి వైట్‌ఫీల్డ్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈనెల 11వ తేదీన స్వాతి అనే యువతితో వివాహమైంది. ఈక్రమంలో తిరుమలేశుడి ఆశీస్సుల కోసం భార్యతోపాటు తన తల్లిదండ్రులు, అత్తమామలు ఇలా దాదాపు 20 మంది కుటుంబీకులతో శుక్రవారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులందరినీ వాహనాల్లోనే తిరుమలకు వెళ్లమని చెప్పాడు. తాను మాత్రం మొక్కు ఉందని అత్త కుమారుడితో కలిసి మధ్యాహ్నం 12.30 గంటలకు అలిపిరి నుంచి కాలినడక ప్రారంభించాడు. అప్పటివరకు బాగానే ఉన్న నరేష్.. 2,300 మెట్టు వద్దకొచ్చేసరికి ఛాతి పట్టుకుని కుప్పకూలిపోయాడు. పక్కనే ఉన్న బంధువు, భక్తులు పైకి లేపే ప్రయత్నం చేశారు. మరోవైపు అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నరేష్ మృతి చెందాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియడంతో వారంతా శోకసంద్రంలో మునిగిపోయారు.

సమాచార దర్శిని

31 వరకు ఉత్తర చెన్నై ఐటీఐ అడ్మిషన్లు

ఐసిఎఫ్, ఆగస్టు 23: స్థానిక మింట్ సమీంపలోని ఉత్తర చెన్నై ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 31వ తేది వరకు విద్యార్థుల అడ్మిషన్లు జరగనున్నాయి. టెన్త్ పాస్, ప్లస్ టూ, డిప్లొమా చదివిన వారు రెండేళ్ల వృత్తి విభాగంలో సివిల్ ఇంజనీరింగ్, అసిస్టెంట్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్ డ్రాఫ్ట్‌మెన్, మెకానికల్, టర్నర్, మెషినిస్ట్, లిఫ్ట్ మెకానిక్, ఫిట్టర్ సహా పలు కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఔత్సాహికులు ఈ నెల 31వ తేది వరకు చేరవచ్చు. విద్యార్థులకు ప్రతినెలా రూ.750 ఉపకారవేతనంతోపాటూ పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూ, బస్ పాస్ ఉచితంగా అందిస్తారు. వివరాలకు 9894192652, 9499055658 నెంబర్లలో సంప్రదించవచ్చు.

హొగెనేకల్‌లో దోనెల సవారీకి అనుమతి

పెరంబూర్, ఆగస్టు 23: హొగెనేకల్ కావేరి నదిలో దోనెల సవారీకి జిల్లా యంత్రాంగం అనుమతించింది. కర్ణాటక డ్యాం నుంచి విడుదల చేస్తున్న నీరు, కావేరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాలతో హొగెనేకల్‌లో నీటి ఉధృతి అధికంగా ఉండడంతో పర్యాటకుల భద్రత దృష్ట్యా దోనెల సవారీని నిషేధించారు. ప్రస్తుతం హొగెనేకల్ కావేరి నదిలో నీటి రాక 8,000 ఘనపుటడుగులకు తగ్గడంతో, దోనెల సవారీకి అనుమతించారు. అలాగే, జలపాతాలు, నదిలో స్నానాలకు కూడా అనుమతించడంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ర్యాంకులతో మరింత ప్రోత్సాహం

ప్యారీస్, ఆగస్టు 23: జాతీయ స్థాయిలో లభించే ర్యాంకులు విద్యాసంస్థల భవిష్యత్తుకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని సీమాట్స్ ఛాన్సలర్ ఎన్ఎం వీరయ్యన్ పేర్కొన్నారు. ఎన్ఆర్ఐఎఫ్ ఇండియా ర్యాంకింగ్స్ - 2024లో సీమాట్స్‌కు డీమ్డ్ వర్శిటీగా ఒక్కో కేటగిరిలో 9 ర్యాంకులు వచ్చినట్లు వీరయ్యన్, ప్రో ఛాన్సలర్ డాక్టర్ దీపక్ నల్లసామి తెలిపారు. దేశంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో ఒకటిగా తమ సంస్థకు గుర్తింపు రావడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. యూనివర్శిటీ కేటగిరీలో 11, మెడికల్‌లో 12, న్యాయశాస్త్రంలో 13, పరిశోధనలలో 20 ఓవర్‌ఆల్‌గా 22, ఇంజనీరింగ్‌లో 53, మేనేజ్‌మెంట్‌లో 74, రిసెర్చిలో 11 ర్యాంకులు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఆరు డిపోల అభివృద్ధికి నిధులు

ఐసిఎఫ్, ఆగస్టు 23: మెట్రోపాలిటన్ రవాణా సంస్థకు చెందిన ఆరు డిపోల అభివృద్ధికి రూ.111.50 కోట్లు కేటాయించారు. పెరంబూర్-2, తండయార్‌పేట, వ్యాసర్పాడి, పూందమల్లి, కలైంజర్ నగర్, పెరుంబాక్కం అని ఆరు డిపోలను అభివృద్ధి చేసేందుకు తొలివిడత చర్యలను ఎంటీసీ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

చెన్నైలో రెండు ఆసుపత్రుల అనుమతి రద్దు

ప్యారీస్, ఆగస్టు 23: రాజధాని నగరం చెన్నైలో చట్టవిరుద్ధంగా మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స, చిన్నారి కాలు తొలగింపునకు పాల్పడిన రెండు ఆసుపత్రుల అనుమతిని తాత్కాలికంగా రద్దు చేస్తూ ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీచేసింది. స్థానిక ఆదంబాక్కంలో ఉన్న మౌంట్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో నగరంలో 7వ తరగతి చదువుకుంటున్న హరికృష్ణన్ (11) రెండు కాళ్లలో నొప్పి ఏర్పడడంతో చికిత్స కోసం చేరాడు. అక్కడ అతనిని పరీక్షించిన వైద్యులు, కాళ్లలో రక్తనాళాల్లో ప్రసరణ ఆగిపోయిందని తెలిపి అందజేసిన చికిత్సలు ఫలించలేదు. దీంతో ఆ బాలుడి కాళ్లను వైద్యులు తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ తల్లిదండ్రులు ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన వైద్యనిపుణుల కమిటీ, బాలుడికి వైద్యచికిత్సలు అందించడంలో నిర్లక్ష్యమే కారణమని గుర్తించి ఆసుపత్రి అనుమతిని తాత్కాలికంగా రద్దు చేశారు. అదే విధంగా, ఫ్రైడ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చట్టవిరుద్ధంగా మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స జరుగుతున్నట్లు అందిన సమాచారంతో ప్రభుత్వ వైద్యనిపుణుల కమిటీ ఆ ఆసుపత్రికి వెళ్లి తనిఖీలు నిర్వహించింది. అప్పుడు నామక్కల్ జిల్లా పల్లిపాళయంకు చెందిన సుందరం అనే కార్మికుడు తన మూత్రపిండాన్ని దానంగా పొందిన ఓ వ్యక్తి అందుకు తనకు ఎలాంటి నగదు ముట్టచెప్పకుండా మోసం చేసినట్లు నామక్కల్ జిల్లా ఎస్పీ వద్ద ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఆ ఆసుపత్రి అంగీకారం కూడా తాత్కాలికంగా రద్దు చేయడంతో రెండు ఆసుపత్రులు మూతపడ్డాయి.

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం

రాష్ట్ర మహిళా క్రికెట్ టీం సెలెక్టర్ దాక్షాయణి



విజేతలతో దాక్షాయణి తదితరులు

ప్యారీస్, ఆగస్టు 23: విద్యార్థుల్లో మానసిక, శారీరక దృఢత్వం, ఆరోగ్యం క్రీడలతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర మహిళా క్రికెట్ టీం సెలెక్టర్ డాక్టర్ బి. దాక్షాయణి అన్నారు. స్థానిక చూళైలోని మహర్షి విద్యామందిర్ సీనియర్ సెకండరీ పాఠశాల దశమ వార్షిక క్రీడా దినోత్సవం పెరియమేడులోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శుక్రవారం ఉదయం వాసవీ మాత పూజ, ప్రార్థనాగీతంతో ప్రారంభమయ్యాయి. పాఠశాల గౌరవ కరస్పాండెంట్ టీవీ రామకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలలో ఎస్కేపీడీ చారిటీస్ ట్రస్టీలు దేసు లక్ష్మీనారాయణ, సీఆర్ కిషోర్ బాబు, ప్రిన్సిపల్ పి.సుబ్రమణ్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ విభాగాలలో నిర్వహించిన ఈ పోటీలలో ఆసక్తి పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి దాక్షాయణి, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు,పతకాలు బహూకరించి అభినందించారు.

డాక్టర్ కల్పనా శంకర్ ఆత్మకథ ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సౌమ్యా స్వామినాథన్

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): న్యూక్లియర్ సైంటిస్టుగా, పారిశ్రామికవేత్తగా మహిళా లోకానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన డాక్టర్ కల్పనా శంకర్ ఆత్మకథ 'ది సైంటిస్ట్ ఎంట్రాప్రెన్యూర్ : ఎంపవరింగ్ మిలియన్స్ ఆఫ్ విమెన్ టుడే ఇన్ చెన్నై' ని డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ రిసెర్చి ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ సౌమ్యా స్వామినాథన్ ఆవిష్కరించారు. జోహో కార్పొరేషన్ సీఈఓ శ్రీధర్‌వేంబు, స్వాడీ మార్టిన్, నటి అనుహాసన్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శంకరన్‌కోవిల్ ఆలయ మహాకుంభాభిషేకం


మహాకుంభాభిషేక వేడుకలను వీక్షిస్తున్న భక్తులు - ఆలయ రాజగోపురంపై కలశాలను పవిత్ర నదీ జలాలతో సంప్రోక్షణ చేస్తున్న శైవాగమ పండితులు, ప్రధాన అర్చకులు

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం శంకరన్ కోవిల్ శంకరనారాయణ స్వామి ఆలయ మహా కుంభాభిషేక వేడుకలు శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఆలయానికి 2008లో మహాకుంభాభిషేకం జరిగింది. పన్నెండేళ్లకోమారు కుంభాభిషేకం నిర్వహించాలన్న ఆగమ నిబంధనల ప్రకారం 2020లో కుంభాభిషేకానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టగా లాక్‌డౌన్ కారణంగా జీర్ణోద్ధరణ పనులను నిలిపివేశారు. ఈక్రమంలో రెండేళ్లుగా శంకరన్ కోవిల్ ఆలయ జీర్ణోద్ధరణపనులు చేపట్టారు. ఆలయంలోని అన్ని సన్నిధులు, వాటిపైనున్న విమానాలు, ప్రధాన రాజగోపురం మరమ్మతులు పూర్తయ్యాయి. మహాకుంభాభిషేకాన్ని పురస్కరించుకుని తెన్‌కాశి జిల్లాకు శుక్రవారం స్థానిక సెలవు ప్రకటించారు. కుంభాభిషేకంలో భాగంగా యాగశాల పూజలు నిర్వహించారు. ఆలయ అంతర ప్రాకారంలో 66 యాగ గుండాలను ఏర్పాటు చేసి హోమాలు నిర్వహించారు. కుంభాభిషేక పూర్వాంగ పూజలు ఈనెల 16న ప్రారంభమయ్యాయి. మంగళవాద్యం, వేదపారాయణం, తిరుమురై పారాయణం నిర్వహించారు. ఆచార్య విశేషశాంతి, విఘ్నేశ్వరపూజ, పుణ్యావహచనం ద్వితీయ కాల యాగశాల పూజ నిర్వహించారు. అటు పిమ్మట మూలమూర్తుల అష్టబంధనం, సాయంత్రం ఆచార్య విశేష శాంతి, విఘ్నేశ్వర పూజలు తృతీయ కాల, చతుర్థ కాల యాగశాల పూజలు కొనసాగాయి. గురువారం ఉదయం పరివార యాగశాలలో మహాపూర్ణాహుతి, దీపారాధన ముగిశాయి. పవిత్ర నదీజలాలు, విశేష తీర్థాల జలాలున్న కలశాలను ఆలయ రాజగోపురం మీదకు, వివిధ సన్నిధులపై విమానాల మీదకు తరలించే కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాన యాగశాలలో మహాపూర్ణాహుతి, ఉపచారాలు నిర్వహించారు. శిఖరాగ్ర కార్యక్రమంగా మహాకుంభాభిషేకాన్ని శుక్రవారం ఉదయం 5గంటలకు మంగళవాయిద్యం, 5.30 గంటలకు వేదపారాయణం, ఉదయం 6గంటలకు తిరుమురై పారాయణం, 6.30 గంటల నుంచి విఘ్నేశ్వరపూజలు నిర్వహించారు. ఉదయం 8గంటలకు పవిత్రజలాల కలశాల ఊరేగింపు, 9గంటలకు గోమతి అంబికా సమేత శంకర లింగస్వామి, శంకర నారాయణస్వామి విమానం, రాజగోపురం మహా కుంభాభిషేకం, 9.20 గంటలకు గోమతి అంబిక సమేత శంకరలింగస్వామి, శంకరనారాయణస్వామి మూలస్థాన మహాకుంభాభిషేకం, మహా దీపారాధన నిర్వహించారు. ఈ వేడుకలను రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వేలాది మంది భక్తులు వీక్షించారు. ఈ వేడుకల్లో మంత్రి మూర్తి, ఎంపీ రాణిశ్రీ కుమార్, ఎమ్మెల్యే రాజా, మాజీ మంత్రి వీఎం రాజలక్ష్మి, ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ షణ్ముగయ్యా, సభ్యులు రామకృష్ణన్, ముప్పిడాది, వెళ్లైసామి, ముత్తులక్ష్మి, తెన్‌కాశి జిల్లా కలెక్టర్ కమల్‌కిషోర్, తెన్‌కాశి ఎస్పీ శీనివాసన్, అన్నాడీఎంకే ప్రచార ప్రతినిధి అయ్యాదురై పాండ్యన్, అల్లిరాణి అయ్యాదురై పాండ్యన్, తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిలో ఆమ్నీ బస్సు దగ్ధం


దగ్ధమైన బస్సును పరిశీలిస్తున్న ట్రాఫిక్ విభాగం పోలీసులు

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి మన్నార్‌పురం ఫ్లైఓవర్ సమీపంలో శుక్రవారం వేకువజామున 28 ప్రయాణికులతో వెళ్తున్న ఆమ్నీ బస్సు ఉన్నట్టుండి మంటల్లో చిక్కుకుని దగ్ధమైంది. బస్సులో మంటలు చెలరేగుతుండటం గమనించిన డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి ప్రయాణికులందరినీ కిందకు దింపివేయడంతో ప్రాణగండం తప్పింది. తిరునల్వేలి జిల్లా దిసైవిళై నుంచి గురువారం రాత్రి చెన్నైకి ఆమ్నీ బస్సు బయలుదేరింది. ఆ బస్సును సాత్తూరుకు చెందిన అళగురాజా నడిపాడు. చెన్నై తిరుమళిసై ప్రాంతానికి చెందిన అజస్ కండక్టర్. ఆ బస్సులో 28 మంది ప్రయాణించారు. ఆ బస్సు శుక్రవారం వేకువజాము 2.15 గంటల ప్రాంతంలో మదురై - చెన్నై జాతీయ రహదారిలో తిరుచ్చిలోని మన్నార్‌పురం ఫ్లైఓవర్‌పై వెళ్తుండగా బస్సు వెనుక టైర్ పంక్చరైంది. వెంటనే డ్రైవర్ బస్సును రహదారి పక్కగా నిలిపాడు. టైర్ పంక్చరైన ప్రాంతం నుంచి ఉన్నట్టుండి మంటలు చెలరేగడంతో అప్రమత్తమై ప్రయాణికులను నిద్ర నుంచి లేపి కిందకు దింపారు. ప్రయాణికులందరూ కిందకు దిగగానే బస్సు నలువైపులా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న కంటోన్మెంట్ ఫైర్‌స్టేషన్ అగ్నిమాపక దళం సభ్యులు ఫైరింజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఆ తర్వాత ప్రయాణికులందరిని మరో బస్సులో చెన్నైకి పంపారు. ఈ ప్రమాదం కారణంగా ఆ మార్గంలో అరగంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ విభాగం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

కరుణానిధి రచనలు జాతికి అంకితం

● సీఎం స్టాలిన్

ఐసిఎఫ్, ఆగస్టు 23: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి రచనలు జాతికి అంకితం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. తమిళ అభివృద్ధి శాఖ ద్వారా తమిళ గ్రంథాలను జాతికి అంకితం చేస్తున్నారు. ఈ గ్రంథాల సంఖ్య, ప్రత్యేకతల ఆధారంగా వాటి యజమానులకు కాపీ రైట్ నగదు అందిస్తున్నారు. ఇప్పటివరకు 179 మంది తమిళుల గ్రంథాలు జాతికి అంకితం చేయగా, కాపీ రైట్‌గా రూ.14.4 కోట్లు అందజేశారు. ఈ వరుసలో కరుణానిధి గ్రంథాలు కాపీ రైట్ లేకుండా జాతికి అంకితం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

విజయ కరిసల్ కుళంలో పగడపు రాతి ముద్రలు


తవ్వకాల్లో బయల్పడిన పగడపు రాతి ముద్ర

ఐసిఎఫ్, ఆగస్టు 23: విరుదునగర్ జిల్లా విజయ కరిసల్ కుళంలో చేపట్టిన తవ్వకాల్లో పగడపు రాతి ముద్ర బయల్పడింది. ఈ ప్రాంతంలో మూడో విడత తవ్వకాల్లో ఇప్పటివరకు బంకమట్టితో తయారుచేసిన విరిగిన బొమ్మలు, చదరంగం పావులు, మహిళ శిరస్సు ఇలా 1,500లకు పైగా వస్తువులు బయల్పడ్డాయి. ఈ నేపథ్యంలో, ఎద్దు రూపాన్ని చెక్కిన పడగపు ముద్ర రాయి వెలుగు చూసింది. ఈ విషయమై పురావస్తు పరిశోధకులు మాట్లాడుతూ... ఇప్పటివరకు వివిధ రకాల వస్తువులు బయల్పడగా, మొట్టమొదటిసారిగా తాఖీదుల్లో ముద్ర వేయడానికి ఉంగరానికి పొదిగించిన ముద్ర రాతిని గుర్తించామన్నారు.

దోమల నిర్మూలనపై చర్యలు


7వ వార్డులో పాత టైరును పరిశీలిస్తున్న అధికారులు

వేలూరు, ఆగస్టు 23: కార్పొరేషన్ 1వ మండల పరిధిలోని 7వ వార్డులో శుక్రవారం అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరన్ అధ్యక్షతన ఆరోగ్యశాఖ అధికారి శివకుమార్ నేతృత్వంలో ఉద్యోగులు దోమల ఉత్పత్తి ప్రాంతాలను పరిశీలించారు. అలాగే, వర్షపు నీరు నిల్వ వున్న పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఉపయోగంలో లేని పాత్రలు పరిశీలించిన అధికారులు, ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. అలాగే, ఆ ప్రాంతంలో పారిశుధ్య కార్మికులు దోమల ముందు పిచికారీ చేపట్టారు.

వేలూరులో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి


వేలూరు, ఆగస్టు 23: అంతర్జాతీయ యువకుల దినం సందర్భంగా తమిళనాడు ఎయిడ్స్ కంట్రోల్ సంఘం తరఫున ఎయిడ్స్ నియంత్రణ అవగాహన ర్యాలీ శుక్రవారం జరిగింది. కాట్పాడి చిత్తూరు బస్టాండ్‌లో ర్యాలీని కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. ఈ ర్యాలీలో 273 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ వీఐటీ యూనివర్శిటీ వరకు సాగింది. ర్యాలీలో జిల్లా ఆరోగ్యశాఖ అధికారి భానుమతి, ఆరోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశన్, గీతారాణి, ఆనందచిత్ర, ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ పార్థసారథి, వీఐటీ వ్యాయామ శాఖ డైరెక్టర్ త్యాగశాంతన్ తదితరులు పాల్గొన్నారు.

ఊరీసు కళాశాలలో సంత


సంతలోని వస్తువులు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఆగస్టు 23: రాష్ట్ర రూరల్ జీవనా దార ఇయక్కం ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక బృందాలు ఉత్పత్తి చేసే వస్తువుల ఎగ్జిబిషన్ శుక్రవారం స్థానిక ఊరీసు కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఈ సంతలో ఆహార వస్తువులు, అలంకరణ సాధనాలు, తాటి ఆకుల వస్తువులు సహా పలురకాలు ఉన్నాయి. శనివారం కూడా సంత జరగనుందని, ఈ సంతలో రూ.10 లక్షల విక్రయాలు జరుగుతాయని భావిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, ఉప పథక అధికారి ధనలక్ష్మి, జిల్లా సప్లై అధికారి సుమతి, ఊరీసు కళాశాల ప్రిన్సిపాల్ కమల, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నటుడు ఎస్వీ శేఖర్‌కు అస్వస్థత


ఆక్సిజన్ మాస్కుతో ఎస్వీ శేఖర్

అడయార్, ఆగస్టు 23: తమిళ సినీ, రంగస్థల నటుడు, మాజీ ఎమ్మెల్యే, భారతీయ జనతా పార్టీ మాజీ నేత ఎస్వీ శేఖర్ అస్వస్థతకు లోనయ్యారు. ఈ విషయాన్ని ఆయన తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. శ్వాస సంబంధిత సమస్యల కారణంగా అస్వస్థతకు లోనైనట్టు ఆయన పేర్కొన్నారు. డాక్టర్ శివకటాక్షం, డాక్టర్ గుహన్, డాక్టర్ బాలు సలహా, సూచన మేరకు ముఖానికి ఆక్సిజన్ మాస్క్ ధరించి, విశ్రాంతి తీసుకుంటున్నానని, ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నట్టు ఆయన తెలుపుతూ, ఒక ఫొటోను కూడా షేర్ చేశారు. కాగా, తమిళ చిత్రపరిశ్రమలోని సీనియర్ నటుల్లో ఒకరైన ఎస్వీ శేఖర్ గతంలో అన్నాడీఎంకే, భారతీయ జనతా పార్టీల్లో పనిచేశారు. మైలాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కూడా ఎన్నికయ్యారు.

జ్యువల్ వన్ షోరూం ప్రారంభం


ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 23: స్థానిక అన్నాసాలై ఊరీసు కళాశాల సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన జ్యువల్ వన్ షోరూం ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుశి గ్రూప్ ఆఫ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మణివన్నన్, ఎమరాల్డ్ జ్యువెలరీ ఇండస్ట్రీ ఛైర్మన్ శ్రీనివాసన్, ధియాన్ శ్రీనివాసన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో షోరూం ప్రారంభించి, తొలి విక్రయం చేపట్టారు.

లెక్చరర్‌కు అభినందన



వేలూరు, ఆగస్టు 23: స్థానిక ముత్తురంగం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గణిత లెక్చరర్ మురళీకృష్ణన్‌కు చెన్నైలో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో 'నాన్ ముదల్‌వన్' పథక బెస్ట్ ఆర్గనైజర్ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధరన్, సహచర అధ్యాపకులు మురళీకృష్ణన్‌కు శాలువ కప్పి అభినందించారు.

డీఎంకే సమావేశం


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, ఆగస్టు 23: ఆనైకట్టు తాలూకా డీఎంకే నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశానికి కేంద్ర యూనియన్ సెక్రటరీ వెంకటేశన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా సెక్రటరీ నందకుమార్, ఎంపీ కదిర్ ఆనంద్, ఆంబూరు ఎమ్మెల్యే విల్వనాథన్, జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో యూనియన్ అవైఅధ్యక్షుడు మణిమారన్, జిల్లా ఉప సెక్రటరీలు పాండ్యన్, మలర్‌విలి, యూనియన్ ఉపాధ్యక్షుడు భాస్కరన్, యూనియన్ ఉప సెక్రటరీ కృష్ణమోహన్, సభ్యులు పాల్గొన్నారు.

రామాపురంలో ఎలక్ట్రిక్ మోటారు వాహనాల షోరూం

● ప్రారంభించిన మంత్రులు


షోరూం ప్రారంభోత్సవంలో మంత్రులు మనోతంగరాజ్, అన్బరసన్

ప్యారీస్, ఆగస్టు 23: స్థానిక రామాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్ మొబిలిటి లిమిటెడ్ ఎలక్ట్రిక్ వాహనాల షోరూంను రాష్ట్ర మంత్రులు మనో తంగరాజన్, టీఎం అన్బరసన్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో పేరుగాంచిన డియోన్ సంస్థ కొత్తగా డిజైన్ చేసిన అగస్టా ఎస్పీ ఈ - స్కూటర్, అదే విధంగా అగస్టా ఎఫ్‌హెచ్ స్కూటర్‌ని నిర్వాహకులు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో వీజీపీ సంస్థల అధినేత వీజీ సంతోషం, మాజీ ఎంపీ రాధికాసెల్వి, ప్రశాంత్ విజయమ్మ, ఎస్ఎం ఆంటోని థామస్, అనుషా మార్గరేట్, వినోద్ జయరాజ్, జాన్ మేరీస్, జీసెస్‌మోరీస్ రవి తదితరులు పాల్గొన్నారు.

తిరుమంగళంలో రౌడీ అరెస్టు

అడయార్, ఆగస్టు 23: స్థానిక తిరుమంగళంలో రౌడీ విక్కీని పోలీసులు అరెస్టు చేశారు. జేజే నగర్ పోలీస్ స్టేషన్ రికార్డుల్లో విక్కీపై అనేక కేసులు నమోదైవున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈనెల 20న తిరుమంగళం మెయిన్ రోడ్డులో ఉన్న సూపర్ మార్కెట్‌లోకి దుంగతో వెళ్లిన విక్కీ... దీపావళికి రూ.5 వేలు మామూలు ఇవ్వకుంటే సూపర్‌మార్కెట్‌లో పెట్రోల్ పోసి నిప్పంటిస్తానని హెచ్చరించాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళింది. వారి ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన తిరుమంగళం ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షఫీయుల్లా ప్రత్యేక బృందంతో విక్కీ ఆచూకీ గుర్తించి అరెస్టు చేశారు. ఆయనపై హత్యాయత్నం, హత్యాబెదిరింపులు, షాపు ధ్వంసం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.


వేలూరు జిల్లా పేర్నాంబట్టు పంచాయతీ యూనియన్ రెడ్డియాంకుప్పంలో జిల్లా సమాచార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల ఫొటో ఎగ్జిబిషన్‌ను వీక్షిస్తున్న ప్రజలు

పార్టీ పదవి ఇస్తే వద్దంటానా

● నటుడు విజయ ప్రభాకరన్



ప్యారీస్, ఆగస్టు 23: డీఎండీకేలో తనకు పదవి కట్టబెడితే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానంటూ ప్రేమలత కుమారుడు, సినీనటుడు విజయ ప్రభాకరన్ అన్నారు. ధర్మపురి జిల్లా పెన్నాగరం అసెంబ్లీ నియోజకవర్గంలో శుక్రవారం డీఎండీకే జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సహాయాల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా శాంతిభద్రతలు సరిగాలేవని, రోజుకో హత్య, దోపిడీ, మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. మూడేళ్ల డీఎంకే పాలనలో నేరాలు బాగా పెరుగుతూ వస్తున్నాయని, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ కేసు రోజుకో మలుపు తిరుగుతోందని, అసలైన హంతకులను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా రాజకీయ పార్టీ ప్రారంభించవచ్చని, ఆ రీతిలోనే దళపతి విజయ్ కూడా తమిళగ వెట్రి కళగం పేరుతో పార్టీ ప్రారంభించి జెండా పరిచయం చేయడం ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తల అభీష్టం మేరకు ఎన్నికల్లో పోటీ చేశానని తెలిపారు. పార్టీకి సంబంధించి ఎలాంటి పదవిని ఇచ్చినా సమర్థవంతంగా నిర్వర్తిస్తానని విజయ ప్రభాకరన్ స్పష్టం చేశారు. రాబోయే శాసనసభ ఎన్నికలలోపున పార్టీని పటిష్ఠం చేయడానికి తాను పాటుపడతానని శపథం చేశారు.

ట్రైనీ డాక్టర్ ఆత్మహత్య

పెరంబూర్, ఆగస్టు 23: కోయంబత్తూర్ మదుకరైలో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో ట్రైనింగ్ డాక్టర్‌గా పనిచేస్తున్న కేరళకు చెందిన సంతోష్ (29) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రియురాలికి వాట్సాప్ ద్వారా సమాచారం అందించి, అధిక మోతాదులో మత్తు మందు తీసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రియురాలితో ఏర్పడిన అభిప్రాయ బేధాలతో సంతోష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో విద్యార్థుల రగడ

పెరంబూర్, ఆగస్టు 23: స్థానిక సెంట్రల్ సబర్బన్ రైల్వేస్టేషన్‌లో గురువారం సాయంత్రం విద్యార్థులు ఆగడాలకు పాల్పడడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ స్టేషన్‌లోని 16వ నెంబరు ప్లాట్‌ఫాంపై పచ్చయప్పన్ కళాశాల విద్యార్థులు అరుపులు, కేకలకు పాల్పడడంతో ప్రయాణికులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడకు చేరుకున్న రైల్వే ఎస్పీ, 30 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కోర్టు బోను ఎక్కాల్సి ఉంటుందని హెచ్చరించి పంపించి వేశారు.

టపాసులు పేలి ఒకరి మృతి

పెరంబూర్, ఆగస్టు 23: శివకాశి సమీంలో పశువులకొట్టంలో దాచి ఉంచిన టపాసులు పేలి ఒకరు మృతి చెందారు. వెంబకోటకు చెందిన టపాసుల వ్యాపారి గురువరాజ్, తన ఇంటి ప్రాంగణంలోని పశువుల కొట్టంలో టపాసులు నిల్వ ఉంచాడు. ఈ కొట్టంలో వెల్డింగ్ చేస్తున్న సమయంలో, హఠాత్తుగా టపాసులు పేలి గురవరాజ్, కార్తీక్ గాయపడ్డారు. చుట్టుపక్కల వారు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సలు ఫలించక కార్తీక్ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు విగ్రహాల స్వాధీనం



ఐసిఎఫ్, ఆగస్టు 23: తిరుచ్చి జిల్లా దురైయూర్ సమీపంలోని కోటత్తూర్‌లో రెండు విగ్రహాలను రెవెన్యూ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్రామంలో విద్యుత్ ఉత్పత్తికి ప్రైవేటు సంస్థ విండ్‌మిల్లులు ఏర్పాటు చేస్తోంది. స్తంభాలు నాటేందుకు గుంతలు తవ్వుతుండగా రెండు విగ్రహాలు బయల్పడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని 3 అడుగుల ఎత్తున్న మహావిష్ణువు, మహాలక్ష్మి విగ్రహాలు స్వాధీనం చేసుకున్నారు. ఆ విగ్రహాలను పురావస్తు పరిశోధకులు అందజేసి ప్రాచీనత నిర్ధారించనున్నామని అధికారులు తెలిపారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

● ముగ్గురికి గాయాలు

ప్యారీస్, ఆగస్టు 23: స్థానిక పల్లావరం సమీపంలో అదుపుతప్పిన లారీ ఇంట్లోకి దూసుకెళ్లడంతో నిద్రపోతున్న ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. తిరుసీర్‌మలై ప్రాంతంలో గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనలో జానకి, కీర్తన, కౌసల్య కు గాయాలయ్యాయి. వీరి అరుపులు విని అక్కడకు చేరుకున్న ఇరుగుపొరుగు వారు క్షతగాత్రులను క్రోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం శంకర్‌నగర్ పోలీసులకు అందజేసిన సమాచారంతో పోలీసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

యువతిపై హత్యాచారం

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంబత్తూరు పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రైవేటు పారిశ్రామికవాడలోని ఓ కర్మాగారంలో యువతిపై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాచారం జరిపారు. శుక్రవారం ఉదయం ఆ యువతి మృతదేహం పూర్తి నగ్నంగా పడి ఉండగా స్థానికులు గమనించి దిగ్భ్రాంతి చెందారు. ఈ విషయమై అంబత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. మృతదేహంపై గాయాలుండటంతో దుండగులు అత్యాచారానికి పాల్పడి హతమార్చి ఉంటారని

ఫైనాన్స్ సంస్థలో రూ.1.25 కోట్ల విలువైన నగల చోరీ

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా నాంగునేరి సమీపంలోని వాణిజ్య కాంప్లెక్స్‌లోని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో గుర్తు తెలియని దుండగులు చొరబడి రూ.1.25 కోట్ల విలువైన బంగారు నగలను చోరీ చేశారు. ఆ నగలన్నీ ఫైనాన్స్ సంస్థలో తాకట్టుపెట్టినవని పోలీసులు తెలిపారు. నాంగునేరి సమీపం మూలకారైపట్టికి చెందిన రేమన్ మెయిన్ బజార్‌లో వాణిజ్య కాంప్లెక్స్‌ను నడుపుతున్నాడు. ఆ కాంప్లెక్స్‌లోనే ఆయన ఫైనాన్స్ సంస్థను నడుపుతూ, నగలను తాకట్టుపెట్టుకుని రుణాలిస్తున్నాడు. గురువారం రాత్రి ఆ ప్రైవేటు సంస్థ కార్యాలయానికి తాళాలు వేసి అందరూ ఇళ్లకు తిరిగి వెళ్లారు. శుక్రవారం ఉదయం సిబ్బంది ఆ ఫైనాన్స్ సంస్థను తెరచి చూడగా వెనుకవైపు కిటికీ ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించి దిగ్భ్రాంతి చెందారు. ఆ తర్వాత బీరువాల్లో దాచి ఉంచిన రూ.1.25 కోట్ల విలువైన నగలు, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు తెలుసుకున్నారు. మూలకారైపట్టి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



బాతుల సంరక్షణ, పశువుల కొట్టం, కోడిపిల్లలు, గుడ్లు సంరక్షణకు ప్రత్యేక ఇంక్యుబేటర్

పాలలాగ లాభాన్నిచ్చే వస్తువు మరొకటి లేదు. ఆ స్థాయికి దాని అవసరం ప్రస్తుతం పెరిగిందంటూ తిరుముల్లైవాయల్ ఉక్రా ఫామ్స్ వ్యవస్థాపకురాలు యమున దినేష్ చెబుతోంది. చదివింది ఎం.కాం., గృహిణిగా తనను నచ్చిన దాన్ని చేయమని చెప్పి భర్త ప్రోత్సహించారని, ఆయన సలహాతో ప్రారంభించినదే ఉక్రా ఫామ్స్ అని, ఆ సంస్థను సుమారు 15 యేళ్లుగా విజయవంతంగా నడుపుతున్నానని యమున చెబుతున్నారు.

- ఐసిఎఫ్

పశు సంరక్షణ మాటి... లాభం మీది

● యమున దినేష్



తరుణి

కాలక్షేపం.. : ఆరంభంలో భర్త కోరిక మేరకు, కాలక్షేపంగా కొద్దిస్థాయిలో దీన్ని ప్రారంభించా. రోజులు గడిచే కొద్దీ తమ ఇద్దరికి దీనిపై ఆసక్తి అధికమైంది. ప్రస్తుతం అదే మా ఫుల్ టైం ఉపాధి. ఈ ఆలోచన నా భర్తదే. ఆయన చదువు పూర్తైన తరువాత ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేసేవారు. నా కోసం ఏదైనా చేయాలని ప్రారంభంలో నాలుగు పశువులతో దీన్ని ప్రారంభించాం. ఆయన ఉద్యోగానికి వెళ్లడం, నేను పిల్లలను చూసుకోవడంతో పనిమనుషులతో ఫారాన్ని పర్యవేక్షించాం. పిల్లలు పెద్దవారు కాగా, మేముంటున్న స్థలం సమీపంలో ఫారాన్ని మార్చి మేమే ఫారాన్ని నడుపుతున్నామని, ఆ తర్వాత గేదెలు, కోళ్ల సంరక్షించాం. నాలుగు పశువులతో ప్రారంభించి ప్రస్తుతం 200కు పైగా జీవులను సంరక్షిస్తున్నాం. పశువులు, కోళ్ల మాత్రమే కాకుండా గుర్రాలు, గాడిదలు, బాతులు అని అన్నింటినీ మా ఫాంలో పెంచుతున్నాం. నా పిల్లలకు ఇప్పటినుంచే ఫాం గురించి అవగాహన కల్పిస్తున్నాం.

అన్నీ తెలుసుకున్నాకే... : మనం ఏ పని చేస్తున్నామో దాని గురించి పూర్తిగా తెలుసుకోవడం తప్పనిసరి. మేము ఫారం ప్రారంభించేందుకు నిర్ణయించుకోవడంతో పశువుల పర్యవేక్షణ, పాల కొనుగోళ్లు, పేడతో విలువైన వస్తువుల తయారీ తదితర విషయాలపై పూర్తిగా అధ్యయనం చేశా. ప్రారంభంలో ఫారాన్ని విజయవంతంగా నడపలేకపోయాం. పలు ఓటములు చవిచూశాం. ఆ ఓటములే పలు విషయాలు నేర్పించాయి. తప్పులను విశ్లేషించి, వాటిని సరిదిద్దుకొని ముందుకు వెళ్లాం. అపజయమే విజయానికి తొలి మెట్టు అన్న దానికి మేమే ఉదాహరణ.



కోళ్లు సంరక్షించే ప్రత్యేక గది

200 మంది పశువైద్యులకు శిక్షణ...

మా ఫాం 10 ఎకరాల విస్తీర్ణంలో ఉండడంతో అన్ని పశువులను ఇక్కడే మేత కోసం వదిలిపెడతాం. పాల విక్రయాలు, పశువులు, కోళ్ల విక్రయాలు మినహా పంచగవ్యం, జీవామృతం, మీల్ అమిలం, విభూది, సాంబ్రాణి, వానపాముల ఎరువు, పశువుల ఎరువు లను విక్రయిస్తున్నాం. గత కొన్నేళ్లుగా మా ఫాంకు వెటర్నరీ వైద్య విద్యార్థులు ఇంటర్న్‌షిప్ కోసం వస్తున్నారు. ఇక్కడ ఇదివరకే పశువైద్యులు ఉండడంతో విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించి నేర్పిస్తున్నారు. గత మూడు సంవత్సరాల్లో సుమారు 200 మందికి పైగా విద్యార్థులు ఇక్కడకు శిక్షణ కోసం వచ్చారు. వారి ఇక్కడ శిక్షణ పొందినందుకు సర్టిఫికేట్ కూడా అందజేస్తున్నాం. మాలాగా ఫాం నడపాలని ఇష్టపడే వారికి పశువుల పర్యవేక్షణ, ఆదాయం, వస్తువుల గురించి తెలుసుకొనేందుకు దోహదపడుతోంది. భావితరాలకు దీనిపై ఆసక్తి పెంచేలా ప్రజలు మా ఫామ్‌ను సందర్శించేందుకు అనుమతిస్తున్నాం.

బయటి పశువులకు సంరక్షణ...

పలువురికి పశువులు, కోళ్ల పెంపకంపై ఆసక్తి ఉంటుంది. అయితే వారు నివసించే చోట ఆ సౌకర్యం ఉండదు. వారు మన వద్ద ఉన్న పశువులు లేక వారు కొనుగోలు చేసే పశువులను మా ఫాంలో ఉంచితే సంరక్షిస్తాం. పశువులు కొనుగోలు ఖర్చు మాత్రమే వారిది, ఆ పశువుల పర్యవేక్షణ అంటే దాణా, వైద్యం, ఇతర ఖర్చులన్నీ పశువు నుంచి కొనుగోలు చేసే పాల ద్వారా లభించే రాబడిలో ఒక శాతం మేం పశువు సంరక్షణ కోసం తీసుకుంటున్నాం. ఆ పశువును పర్యవేక్షించే వ్యక్తికి జీతం అందిస్తున్నాం. మిగిలిన పైకం పశువుల యజమానులకు ఇస్తున్నాం. మేము వారి పశువులను సక్రమంగా సంరక్షిస్తున్నామా, లేదా అని ఫాంలో ఉండే సీసీ కెమెరా యాక్సిస్ ద్వారా చూసి తెలుసుకోవచ్చు. వారాంతపు సెలవులు, సమయం ఉన్నప్పుడు కుటుంబ సమేతంగా నేరుగా వచ్చి పశువులతో సమయాన్ని వెచ్చించవచ్చు. దీని ద్వారా పశువులు పెంచాలన్న వారి కోరిక నేరవేరుతుంది... ఒక నిర్దేశిత నగదును సంపాదించేందుకు వీలవుతుంది.

ప్రతిదీ జాగ్రత్తగా... : మా ఫాంలో ఉన్న ఆవులు, గేదెలు, గుర్రాలకు ప్రత్యేక ఆహారం, వైద్య పర్యవేక్షణ ఇలా ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తుంటాం. కోళ్ల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఇంక్యుబేటర్ గది ఏర్పాటు చేశాం. వాటిని పర్యవేక్షించేందుకు పనిమనుషులు, వెటర్నరీ వైద్యులున్నారు. అలాగే, ఫాం నిర్వహణలో ప్రతిరోజు వివరాలు తెలుసుకుంటా. ఏ పశువు విక్రయానికి సిద్ధంగా ఉంది, కొత్తగా ఎన్ని పశువులు, కోళ్ల ఫారంలోకి రానున్నాయి, పాల విక్రయాలు, దాణా, ఇతర ఆహార వస్తువుల కొనుగోలు... ఇలా అన్ని వివరాలు ప్రతిరోజు కంప్యూటర్‌లో నమోదు చేస్తుంటాం. ఒక కార్యాలయం ఎలా పనిచేస్తుందో అలాగే ఓ బృందాన్ని ఏర్పాటు చేసుకొని పర్యవేక్షిస్తున్నాం.



ధనుష్‌కు చెక్కులను అందజేస్తున్న కళానిధి మారన్

'రాయన్' సక్సెస్

● ధనుష్‌కు రెండు గిఫ్టులు అందజేసిన నిర్మాత కళానిధి

సన్ పిక్చర్స్ పతాకంపై ధనుష్ హీరోగా నటించి దర్శకత్వం వహించిన 'రాయన్' సినిమా ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. దీన్ని పురస్కరించుకుని ఆ చిత్ర నిర్మాత కళానిధి మారన్ హీరో, దర్శకుడు ధనుష్‌కు రెండు చెక్కులను బహూకరించారు. ఈ చెక్కుల్లో ఎంత మొత్తం రాశారన్నది మాత్రం సస్పెన్స్‌గా ఉంచారు. ధనుష్ హీరో నటించిన 50వ చిత్రమిది. ఎస్‌జే సూర్య, దుషార విజయన్, సందీప్ కిషన్, కాళిదాస్ జయరాం, ప్రకాష్ రాజ్, సెల్వరాఘవన్ తదితరులు నటించారు. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం. ఈ చిత్రం జూలై 26న విడుదలై ఘన విజయం సాధించింది. దాదాపు రూ.100 కోట్ల లాభానికి చేరువలో ఉంది. ఈ నేపథ్యంలో నిర్మాత కళానిధి హీరోను కలిసి రెండు చెక్కులను బహుమతిగా ఇచ్చారు. ఈ విషయాన్ని సన్ పిక్చర్స్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. కాగా, ఈ చిత్రం శుక్రవారం నుంచి అమెజాన్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది.

విజయ్ గొప్ప నటుడు కావడానికి తండ్రే కారణం

నటుడు చరణ్‌రాజ్



ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రజ్యోతి

ఇపుడు అగ్రనటుడిగా ఉన్న విజయ్ ఈ స్థాయికి చేరుకోవడానికి ఆయన తండ్రి, సీనియర్ దర్శక నటుడు ఎస్.ఎ.చంద్రశేఖర్ కారణమని సీనియర్ నటుడు చరణ్‌రాజ్ అన్నారు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ తదితర భాషల్లో 600కు పైగా చిత్రాల్లో నటించిన చరణ్‌రాజ్... హీరో, విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్ ఇలా అనేక విభిన్నమైన పాత్రల్లో నటించారు. 'అన్నన్ తంగచ్చి', 'యధార్థ ప్రేమకథ' అనే రెండు చిత్రాలకు దర్శకత్వం కూడా వహించారు. ఇప్పుడు తన చిన్న కుమారుడు దేవ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు. 'కుప్పన్' పేరుతో రూపొందిన ఈ చిత్రంలో హీరోయిన్‌గా సుస్మిత నటించారు. ప్రియా అరుణాచలం మరో హీరోయిన్. వీరితోపాటు చరణ్‌రాజ్ కీలక పాత్రపోషించారు. సోని శ్రీ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం ఎన్.వై.చరణ్‌రాజ్. ఆర్.జనార్దనన్ ఛాయాగ్రహణం, ఎస్.జి.ఇళై సంగీత దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇందులో దర్శక నటుడు చరణ్ రాజ్ మాట్లాడుతూ... 'మత్స్యకారుల గురించి తెలియని అనేక విషయాలను ఈ సినిమాలో చెప్పాం. ఇదొక అందమైన ప్రేమ కథ. నేను దాదాపు 600కు పైగా చిత్రాల్లో అన్ని రకాల పాత్రలను పోషించా. చేతి నిండా డబ్బులు ఇచ్చినా వాటిని ఏం చేయాలో తెలియదు. కానీ, నటించమని కోరితే మాత్రం రేయింబవళ్లు నటిస్తా. ఇపుడు నటనకు దూరంగా ఉంటూ కథలు, సంగీతం, దర్శకత్వం వంటి విభాగాలపై దృష్టి సారించా. విజయ్ అగ్ర హీరో స్థాయికి చేరుకోవడానికి ఆయన తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్ కారణం. ఇపుడు నా చిన్న కుమారుడు దేవ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నా. ప్రేక్షకులతో పాటు మీడియా ఆదరించాలని కోరుతున్నా' అని అన్నారు. ఆ తర్వాత చిత్ర బృంద సభ్యులంతా ప్రసంగించారు.

చిరకాల ప్రియుడితో మేఘా ఆకాష్ నిశ్చితార్థం





కాబోయే భర్తతో మేఘా ఆకాష్

తమిళం, తెలుగు చిత్రపరిశ్రమల్లో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్లలో ఒకరైన మేఘా ఆకాష్‌కు తాజాగా తన చిరకాల ప్రియుడు సాయివిష్ణుతో నిశ్చితార్థం జరిగింది. తమిళంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'పేట' చిత్రంలో ముఖ్య పాత్రను పోషించిన ఆమె.. ఆ తర్వాత 'వందా రాజావాదాన్ వరువేన్', 'బూమరాంగ్', 'ఎన్నై నోక్కి పాయుం తోట్టా', 'వడకుపట్టి రామస్వామి' వంటి హిట్ చిత్రాల్లో నటించారు. తెలుగులో కూడా చెప్పుకోదగిన మూవీల్లో నటించారు. ఇటీవలే తమిళంలో విడుదలైన విజయ్ ఆంటోని చిత్రం 'మళై పిడిక్కాద మణిదన్'లో చివరగా నటించారు. ఈ నేపథ్యంలో ఆమె.. సుదీర్ఘకాలంగా తన చిరకాల మిత్రుడు సాయివిష్ణుతో ప్రేమలో ఉన్నారు. ఇపుడు అతన్ని వివాహం చేసుకునేందుకు సిద్ధమై ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. ఈ నిశ్చితార్థ విషయాన్ని మేఘా ఆకాష్... తన ఇన్‌స్టా ఖాతాలో వెల్లడించారు. 'షై విష్ కమ్ ట్రూ' అంటూ కామెంట్స్ చేసి, తన ప్రియుడు బుగ్గపై ముద్దుపెడుతున్న చిత్రాన్ని షేర్ చేశారు. 'ప్రేమ, నవ్వు, ఆనందం.. ఎప్పటికీ నా జీవితంలోని ప్రేమతో నిశ్చియం చేశారు' అని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు మేఘా ఆకాష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

విజయ్ సేతుపతికి జంటగా నిత్యామీనన్



ప్రముఖ హీరో విజయ్ సేతుపతి సరసన మలయాళ బ్యూటీ నిత్యా మీనన్ నటించనున్నారు. సత్యజ్యోతి ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత టీజీ త్యాగరాజన్ సమర్పణలో నిర్మాతలు సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కుటుంబ కథా చిత్రాలను తెరకెక్కించడంలో గుర్తింపు పొందిన పాండిరాజ్ దర్శకుడు. ఈ ప్రాజెక్టు వివరాలను శుక్రవారం నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. 1950 సంవత్సరం నుంచి మక్కల్ తిలగం డాక్టర్ ఎంజీఆర్, నడిగర్ తిలగం శివాజీ గణేశన్, సూపర్‌స్టార్ రజనీకాంత్, గ్లోబల్ స్టార్ కమలహాసన్, అజిత్ కుమార్, ధనుష్ వంటి గొప్ప నటులతో అనేక హిట్ చిత్రాలను నిర్మించిన ఈ నిర్మాణ సంస్థ... తొలిసారి దర్శకుడు పాండిరాజ్ - విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో ఓ చిత్రానికి ప్లాన్ చేసింది. సత్యజ్యోతి బ్యానరులో విజయ్ సేతుపతి నటించే తొలి చిత్రం ఇదే కావడం గమనార్హం. భారీ వ్యయంతో రూపొందించే ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పలు లొకేషన్లలో జరుపుకుంటోంది. హీరోయిన్ నిత్యామీనన్ త్వరలోనే షూటింగ్‌లో జాయిన్ కానున్నారు. అలాగే, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

ఘనంగా హిందూ కాలేజీ వ్యవస్థాపక దినోత్సవం



వ్యాస రచన పోటీ విజేత ధనుష్‌కు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

అడయార్, ఆగస్టు 23: స్థానిక పట్టాభిరాంలోని ధర్మమూర్తి రావు బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కళాశాల వ్యవస్థాపక దినోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 1969లో ప్రారంభించి ఇప్పటివరకు కొన్నివేల మంది విద్యార్థులకు ఉన్నత చదువులను ఈ కాలేజీ అందించింది. ఈ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో కాలేజీ సంచాలకుడు డాక్టర్ ఎస్.రాజేంద్రనాయుడు మాట్లాడుతూ... ఈ కాలేజీని కలవల కన్నన్ చెట్టి జయంతిని పురస్కరించుకుని స్థాపించినట్టు గుర్తుచేశారు. ఆ రోజుల్లోనే సంపన్నుడైన కన్నన్ చెట్టికి సంతానం లేకపోయినప్పటికీ ప్రజలందరూ తమ సంతానంగా భావించి చంటి పిల్లలకు క్షీరదానం చేశారని తెలిపారు. అనేక మంది పేద ప్రజలకు దాన ధర్మాలు చేసేందుకు తన యావదాస్తిని వినియోగించారని తెలిపారు. కన్నన్ చెట్టి, ఆయన ధర్మపత్ని సీతమ్మ తదనంతరం కార్యవర్గ సభ్యులు ఈ ధార్మిక సంస్థను ఇప్పటికీ విజయపథంలో నడిస్తున్నారని పేర్కొన్నారు. గత 2019లో నాటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఈ ధార్మిక సంస్థ 150వ సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక తపాళా బిళ్లను ఆవిష్కరించారని వెల్లడించారు. ఈ విద్యా సంస్థలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు అనేక మంది ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించారని తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కల్విక్కరసి మాట్లాడుతూ, కాలేజీ యాజమాన్యం ఆనాటి నుంచి నేటి వరకు ధార్మిక సంస్థ చేస్తున్న అనేక దాన ధర్మాలు నిరంతరాయంగా సాగుతున్నాయని, దీనికి కారణం కన్నన్ చెట్టి సత్సంకల్పంతో పాటు ఆ పుణ్య దంపతుల ఆశీస్సులేనన్నారు. ఈ సందర్భంగా కాలేజీ వ్యవస్థాపకుల చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఆ తర్వాత తెలుగు, తమిళం, హిందీ, ఆంగ్ల భాషల శాఖలకు చెందిన విద్యార్థులకు వివిధ రకాలైన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.





రంగు కాగితాలతో తయారైన దుస్తులు ధరించి సందడి చేస్తున్న విద్యార్థినులు - రాధాకృష్ణుల వేషధారణలో కనువిందు చేస్తున్న విద్యార్థినులు

ఎస్కేపీసీలో కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం

ప్యారీస్, ఆగస్టు 23: స్థానిక జార్జిటౌన్‌లోని శ్రీకన్యకాపరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్కేపీసీ)లో కళాలయ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండురోజుల ఇషా అంతర్విభాగాల కల్చరల్ ఫెస్ట్ శుక్రవారం ప్రారంభమైంది. తొలిరోజు శ్రీకృష్ణాష్టమిని ఆహ్వానిస్తూ విద్యార్థినులు రాధాకృష్ణుల వేషధారణతో కనువిందు చేశారు.అలాగే శబ్ద, వాయు కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ ప్రజలకు అవగాహన కల్పించేలా విధంగా విద్యార్థినులు ఎకోఫ్రెండ్లీ డ్రెస్సుల (రంగు కాగితాలతో తయారు చేసిన దుస్తుల)ను ధరించి సందడి చేశారు. అలాగే నీటిపై రంగోలీ, కామెడీ రీల్స్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు కళాశాల గౌరవ కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మోహనశ్రీ బహుమతులు ప్రదానం చేశారు. విజేతలను న్యాయ నిర్ణేతలు, కళాశాల నిర్వాహకులు అభినందించారు.



→ సదస్సులో పాల్గొన్న వైద్యులతో డాక్టర్ గోవిందరాజన్

క్యాన్సర్ చికిత్సలో కొత్త థెరపీ

ప్యారీస్, ఆగస్టు 23 : క్యాన్సర్ చికిత్సకు కొత్త హెచ్‌డీఆర్ బ్రాచీ థెరపీ సిస్టమ్స్ ఫ్లెక్సిట్రాన్ అందుబాటులోకి వచ్చిందని చెన్నైలోని డాక్టర్ కామాక్షి మెమోరియల్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గోవిందరాజన్ తెలిపారు. గిండిలో శుక్రవారం జరిగిన వైద్యనిపుణుల సదస్సులో క్యాన్సర్ నివారణకు ఈ కొత్త విధానం గురించి ఆయన వివరించారు. క్యాన్సర్‌కు బలమైన, ఖచ్చితమైన చికిత్స డెలివరీ యూనిట్ విధానమని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు విశేష స్పందన

ప్యారీస్, ఆగస్టు 23: ఉత్తర చెన్నై హార్బర్ నియోజకవర్గంలో దయాళు అమ్మాళ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని శుక్రవారం ఉదయం మంత్రి ఉదయనిధి జ్యోతి వెలిగించి ప్రారంభించగా, మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ దయానిధి మారన్ తదితరులు పాల్గొన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, మహిళలకు టైలరింగ్ శిక్షణ, పురుషులకు కంప్యూటర్ శిక్షణ తరగతులను కూడా ఈ కార్యక్రమంలో ప్రారంభించారు.



టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉదయనిధి